
గోసాయికాలనీలో నల్లాకు ట్యాప్ లేకపోవడంతో వృథాగా పోతున్న తాగునీరు

నీళ్లంటే నిర్లక్ష్యమా?

బషీరాబాద్, మార్చి 3: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఓ పక్క తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సమీక్షలు, సమావేశాల్లో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని గోసాయికాలనీ, మైనార్టీ కాలనీల్లో నల్లాలకు ట్యాప్ లేకపోవడంతో గంటల తరబడి తాగునీరు వృథాగా పోతోంది. మరో పక్క ఎండలు ముదరడంతో భూ గర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఉన్న నల్లాల ద్వారా నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


విద్యుత్ వెలుగుల్లో ఎల్లమ్మ ఆలయం

ఎల్లమ్మకు మొక్కులు

బొంరాస్‌పేట్, మార్చి 3: కోరిన కోర్కెలు తీర్చే పోలెపల్లి ఎల్లమ్మ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీతో పాటు మేనేజర్ రాజేందర్‌రెడ్డి దగ్గరుండి సౌకర్యాలను పర్యవేక్షించారు.


అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

పల్స్ పోలియో విజయవంతం

- వికారాబాద్ జిల్లాలో 93, మేడ్చల్ జిల్లాలో 97 శాతం నమోదు
- నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయనున్న సిబ్బంది


రామయ్యగూడ, కీసరలో పోలియో చుక్కల మందు వేస్తున్న డీఎంహెచ్‌వోలు పాల్వన్‌కుమార్, రఘునాథస్వామి

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), మార్చి 3: జాతీయ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో విజయవంతంగా ముగిసింది. వికారాబాద్‌జిల్లా వ్యాప్తంగా 545 పోలియో బూత్‌లద్వారా 87,938 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ తెలిపారు. వికారాబాద్‌పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. జిల్లాలో 93శాతం పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. సోమవారం, మంగళవారం ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి పిల్లందరికీ పోలియో చుక్కలు వేస్తారన్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని, వారిబంగారు భవిష్యత్తుకు, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వికారాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, రద్దీప్రదేశాలతో రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలను వైద్య సిబ్బంది అంగన్‌వాడీ టీచర్స్, ఆశాలు వేశారు. మేడ్చల్ జిల్లాలో 97శాతం పల్స్‌పోలియో చుక్కలు వేయడం జరిగిందని డీఎంహెచ్‌వో రఘునాథస్వామి పేర్కొన్నారు. 1093 కేంద్రాలు, 39 మొబైల్ టీంల ద్వారా 109రూట్ల ద్వారా 4,61,428 మందిచిన్నారులకు చుక్కల మందు వేశారు.

అనుమానంతో భార్యను చంపిన భర్త

- పూడూరు మండలం దేవనోనిగూడలో ఘటన


ప్రమీల (ఫైల్)

పూడూరు, మార్చి 3: అనుమానంతో ఓవ్యక్తి కట్టుకున్న భార్యను హతమార్చాడు. ఈఘటన పూడూరు మండల పరిధి దేవనోనిగూడలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన ప్రవీన్, ప్రమీల(28) దంపతులు. ప్రవీన్ వ్యవసాయం చేస్తుండగా, ప్రమీల పరిగి పట్టణంలోని ఓవస్త్ర దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమీల పనినిమిత్తం మరోవ్యక్తి బైక్‌పై వెళుతున్నట్లు భర్త హరిజన ప్రవీణ్‌కు తెలిసిన ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ప్రవీణ్ అనుమానంతో ఇంట్లో అయితే చుట్టుపక్కల వారు చూస్తారనే ఉద్దేశంతో భార్య ప్రమీలను శనివారం పొలం వద్దకు తీసుకెళ్లాడు. కర్రతో ఛాతి, కాళ్లు, చేతులపై బలంగా కొట్టాడు. స్పృహతప్పి పడిపోయిన ఆమెను అక్కడి నుంచి పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వైద్యులకు యాక్సిడెంట్ జరిగినట్లు చెప్పాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు అక్కడి నుంచి మహావీర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రమీల మృతి చెందినట్లు పరిగి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వికారాబాద్ డీఎస్పీ బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 3: వికారాబాద్ డీఎస్పీ అంజయ్య బదిలీ అయ్యారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా వికారాబాద్ నూతన డీఎస్పీగా శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో డీఎస్పీగా శ్రీనివాస్‌రెడ్డి విధులు నిర్వహిస్తుండగా బదిలీపై వికారాబాద్‌కు వస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్!

ఎవరేలినా ఏముంది గర్వకారణం.. అన్నట్లుగా అటు ప్రత్యేకాధికారులైనా, ప్రజాప్రతినిధులైనా వెలగబెట్టిందేమీ లేదనట్లుగా మారింది ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిస్థితి. ఈ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు రావణకాష్ఠంలా మండుతూనే ఉంది. చెత్తను కాల్చివేయడంతో వచ్చే విషవాయువులతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు కలుషితమైనా, ప్రజల ఆరోగ్యాలు మంటకలిస్తే మాకేంటీ అన్నట్లుగా అధికారుల, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయాలు వెచ్చించి నిర్మించిన పొడి చెత్త నిర్వహణ కేంద్రం, తడి చెత్తను ఎరువుగా మార్చే షెడ్లు వెక్కిరిస్తున్నాయి.


చెత్తను కుమ్మరిస్తున్న ఆటో

అన్ని ఉన్నా.. ఏమీ చేయని పరిస్థితి

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పొడి చెత్త నిర్వహణ కేంద్రం, తడి చెత్తను ఎరువుగా మార్చడానికి నిర్మించిన కట్టడాలు అలంకార ప్రాయంగా మారాయి. అధికారుల ఉదాసీనతతో ప్రజాధనం వృథా కావడం తప్పా, ప్రభుత్వ లక్ష్యాలు ఏమాత్రం నెరవేరడం లేదు. చెత్తను నిత్యం కాల్చడంతో వెలువడే అత్యంత ప్రమాదకరమైన పొగను ప్రజలు పీల్చక తప్పని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో మంటలను ఆర్పి వేసి పర్యావరణ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పలువురు పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.


డంపింగ్‌యార్డులో పొగలు

- విషవాయువుల పొగతో జనం బెంబేలు.. పరిసరాలు కలుషితం

ఘట్‌కేసర్‌లో రావణ కాష్టంలా మండుతున్న డంపింగ్ యార్డు

ఘట్‌కేసర్, మార్చి3 : జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలుగానీ, కాలుష్యనియంత్రణ మండలి ఆదేశాలు మాకు వర్తించవు అన్నట్లుగా ఉన్నది ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధికారుల తీరు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. 2018 అక్టోబరు 17న ఘట్‌కేసర్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఘట్‌కేసర్, ఎన్ఎఫ్‌సీ నగర్, కొండాపూర్‌లను కలిపి ఘట్‌కేసర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. దాదాపు ఏడాదిన్నపాటు ప్రత్యేకాధికారుల పాలనలో నడిచింది. 2020 జనవరి 27న మున్సిపాలిటీపాలకవర్గం కొలువుదీరింది. ఎవరేలినా ఏముంది గర్వకారణం అన్నట్లుగా అటు ప్రత్యేకాధికారులైన, ప్రజాప్రతినిధులైన వెలగబెట్టిందేమీ లేదనట్లుగా మారింది మున్సిపాలిటీ పరిస్థితి. దాదాపు ఐదేళ్లుగా రావణకాష్టంలా డంపింగ్‌యార్డులో చెత్త కాల్చుతూనే ఉన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 157లో గల ప్రభుత్వ స్థలంలో దాదాపు 8 ఎకరాలు విస్తీర్ణంలో గతంలో మట్టిని తవ్వుకుపోయారు. మట్టిని తరలించిండంతో ఏర్పడిన భారీ గోతుల్లో చెత్తను వేస్తూ నిబంధనలకు విరుద్ధంగా తగలబెడుతున్నారు. మంటలు ఎక్కువైనప్పుడు డంపింగ్ యార్డు తగులబడుతున్నదని అగ్నిమాపకశాఖకు ఫోన్ చేయడం..ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేయడం.. ప్రజాపతినిధులు మంటలను దగ్గరుండి ఆర్పించామని చెప్పుకోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది.


ప్లాస్టిక్ కవర్లతో నిండి ఉన్న డంపింగ్ యార్డు పరిసరాలు

ఐదేళ్లుగా మండుతూనే...

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు రావణ కాష్టంలా మండుతూనే ఉన్నది. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలోని 18వార్డులకు సంబంధించిన చెత్తను నిత్యం ట్రాక్టర్లు, ఆటోల ద్వారా తీసుకువచ్చి ఇక్కడ పారబోస్తున్నారు. అందులోంచి అవసరమైన వస్తువులను కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏరుకొని తీసుకుపోగా మిగిలిన చెత్తను కాల్చి వేస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం చెత్తను కాల్చకూడదు. చెత్తను కాల్చడంతో వెలువడే పొగ అత్యంత ప్రమాదకరం కనుక సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేయాలి. ఈ ప్రక్రియను చేపట్టడానికి సిబ్బంది కావాలి..అది పెద్ద పనిభారం కావడంతో చేసేదేమీ లేక చెత్తను కాల్చివేస్తున్నారు. దీంతో పరిసరాలు కలుషితమై ప్రజల అనారోగ్యాల బారిన పడుతున్నారు.

చెత్త వేరు చేయడం ఎక్కడ?

తడి,పొడి, హానికారమైన చెత్తను వేరు చేయాలి. కానీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో మాత్రం అలాంటేమి కనిపించడం లేదు. నిత్యం ఇళ్లలో నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేయాలి. తడి చెత్తను ఎరువు తయారు చేసి విక్రయించాలి. పొడి చెత్తను తిరిగి వినియోగించే పరిశ్రమలకు విక్రయించడం చేయాలి. హానికరమైన చెత్తను సైతం ఆయా పరిశ్రమల నిర్వాహకులకు అప్పగించాలి. ఇది చెప్పడానికి అంతా బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం అమలుకావడం లేదు. ఇప్పటికే మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం దగ్గర పడుతున్నది. అయినా మున్సిపాలిటీలో చెత్త డంపింగ్ యార్డు పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని చెత్తడంపింగ్ యార్డు పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి గాలి వీస్తే ప్లాస్టిక్ కవర్లు గాలిపటాల్లా ఎగిరి పంటపొలాల్లో పడుతున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు.


తాళం వేసి ఉన్న పొడిచెత్త నిర్వహణ కేంద్రం

ఎక్కడ చూసినా చెత్తే ..



కొండాపూర్‌లోని డంపింగ్ యార్డు పరిసరాలు పూర్తిగా కలుషితమయ్యాయి. సమీపంలోని పంట పొలాలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతున్నాయి. చెత్త ఆటోల నిర్వాహకులు ఎక్కడ బడితే అక్కడ చెత్తను పారబోస్తున్నారు. ఏళ్ల తరబడి డంపింగ్ యార్డులో నుంచి దట్టమైన పొగలు వస్తూనే ఉన్నాయి. ఈ పొగను పీల్చి ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నాము. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

దక్కి రమేష్, మాజీ సర్పంచ్, కొండాపూర్

చెత్తను కాల్చడం దారుణం



చెత్తను కాల్చడం నిలిపివేయాలి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం చెత్తను కాల్చడం చట్టవిరుద్ధం. ప్రధానంగా డంపింగ్ యార్డుల్లో ని చెత్త ప్రమాదకరమైది. కాల్చిన చెత్త నుంచి వెలువడే వాయువులు అత్యంత ప్రమాదకరమైనవి. దానిని పీల్చడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకోవాలి

- కందకట్ల రామకృష్ణారెడ్డి, న్యాయవాది, ఘట్‌కేసర్

తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నాం



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో చెత్తను కాల్చకుండా చర్యలు తీసుకుంటున్నాం. తడి పొడి చెత్తను వేరు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను వేరు చేసే పనిని ఓ స్వచ్ఛంద సంస్థకు అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేరు చేసి అప్పగించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- ఎండీ సాబేర్ అలీ కమిషనర్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

చేవెళ్ల, మల్కాజిగిరి బరిలో ఎవరో?



- ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు మోహం చాటేస్తున్న సీనియర్లు
- బీఆర్ఎస్‌లో సస్పెన్స్‌గా మారిన టికెట్ల వ్యవహారం
- చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి టికెట్‌పై అనిశ్చితి
- మల్కాజిగిరిలో తెరపైకి రోజుకో పేరు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో అధిష్ఠానం అన్వేషణ
- చేవెళ్ల పరిశీలనలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి .. మల్కాజిగిరిలో కాసాని వీరేష్!


పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి | ఎంపీ రంజిత్‌రెడ్డి | కాసాని వీరేశ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : బీఆర్ఎస్ పార్టీలో చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీ టికెట్లు ఎవరికి అనే విషయం సస్పెన్స్‌గా మారింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో టికెట్లు తీసుకునేందుకు సీనియర్లు మోహం చాటేస్తున్నట్లు సమాచారం. దీంతో అధిష్ఠానానికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. వాస్తవానికి చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఇప్పటికే పార్టీ అధిష్ఠానం ఎంపీ టికెట్ ఖరారు చేసింది. కానీ.. ఆయన పోటీకి ఆసక్తి చూడపం లేదని సమాచారం. అయితే ఈసారి కూడా పోటీ చేయాలని బీఆర్ఎస్ పెద్దలు రంజిత్‌రెడ్డిని బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆయన నిర్ణయం మార్చుకోలేదని, పోటీ చేయనని తేల్చి చెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చజరుగుతోంది. దీంతో బీఆర్ పార్టీ చేవెళ్ల ఎంపీ టికెట్ విషయంలో ప్రత్యామ్నాయ నేతల పేర్లను ఆలోచిస్తుంది. ఈ క్రమంలోనే తెలంగాణ భవన్‌లో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో కొప్పుల మహేష్ రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారిపై కేటీఆర్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. పోటీ చేయడానికి తమకు ఆసక్తి లేదని పలువురు మాజీ ఎమ్మెల్యేలు చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి పోటీ అంటే ఇంతకు ముందు నేతలంతా సంతోషించేవారు. పోటీ తీవ్రంగా ఉండేది. టికెట్ కోసం పైరవీలు చేసుకునేవారు. కానీ.. ఇప్పుడు పిలిచి టికెట్ ఇస్తామన్నా ఒకటి రెండు సార్లు ఆలోచించుకునే పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేటీఆర్ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రివ్యూలు చేశారు. అందులో ఫస్ట్ రివ్యూ చేసిన స్థానం చేవెళ్ల. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మళ్లీ పోటీ చేస్తారని ప్రకటించారు. ఆయన కూడా అన్ని సిద్ధం చేసుకున్నారు. కానీ.. చేవెళ్లలో ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. బలమైన నేతగా ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు ఇటీవలే కాంగ్రెస్‌కు జై కొట్టారు. అదే బాటలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరింది. బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఖరారైంది. బీఆర్ఎస్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీకి వెనుకడుగు వేయడంతో పార్టీ అధిష్ఠానం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనయుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేరు పరిశీలిస్తున్నారు. అలాగే మల్కాజిగిరిలో కూడా పోటీకి సీనియర్లు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. రెండు రోజుల కిందట కాసాని జ్ఞానేశ్వర్ తనయుడు కాసాని వీరేష్‌ను తెలంగాణ భవన్‌కు పిలిచి పార్టీ పెద్దలు మాట్లాడ్డారు. పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో కాసాని కుటుంబం ఇంకా ఏ నిర్ణయం చెప్పలేదని తెలుస్తోంది.

ఇక ప్రజాపాలన సేవా కేంద్రాలు

- గ్యారంటీల ఆమలుకు కొత్తగా ఏర్పాటు
- నేటి నుంచి మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ప్రారంభం
- వికారాబాద్ జిల్లాలో 30 సెంటర్లు ఏర్పాటు
- వచ్చిన దరఖాస్తుల్లో తప్పులు సరిచేయడం, సందేహాల నివృత్తి, కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు



తాండూరు, మార్చి 3 : ప్రభుత్వం మరో కొత్త నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈనెల 4వ తేదీ సోమవారం నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాలను మండల కేంద్రం, మున్సిపాలిటీలు, ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రారంభించడానికి శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలున్నాయి. తాండూరులో నాలుగు, వికారాబాద్‌లో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలో రెండేసి చొప్పున ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 18 మండలాల్లో 18 ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ప్రింటర్‌ను ఏర్పాటు చేశారు. కాగా ప్రజాపాలన వెబ్ పోర్టల్‌ను సీసీజీ ద్వారా అమలు చేయనున్నారు. ఈడీఎంఎస్ , డీఈవోలకు శిక్షణ కూడా శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఆపరేటర్లకు లాగిన్‌లను కలెక్టరేట్ నుంచి ఇస్తారు. అక్కడి నుంచే అధికారులు పర్యవేక్షించనున్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ, ఈ కేంద్రాల్లో ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న పథకాల్లో సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. అంతేకాకుండా వచ్చిన దరఖాస్తుల్లో తప్పులను సరిచేయడంతో పాటు దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఈ కేంద్రాలలో గృహ జ్యోతి, మహాలక్ష్మీ పథకాలను సంబంధించిన దరఖాస్తుల్లో సందేహాలుంటే సిబ్బంది క్లియర్ చేయనున్నారు.

● కడ్తాల మండలం ముద్విన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్లా రాంరెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈమేరకు కల్వకుర్తి నియోజకవర్గ సమస్యలను రాంరెడ్డి సీఎంకు వివరించినట్లు తెలిపారు.



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఏసుమార్గం అనుసరణీయం

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మార్చి 3: ఏసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడి అన్నారు. మానవత్వం, శాంతి, కరుణతో జన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి ఏసు భగవానుడని కొనియాడారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో ఎంబీ షాలెం చర్చిలో ఆదివారం శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి నిర్వాహకుడు, ఉపాధ్యక్షులు లాసర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, క్రైస్తవ సంఘం రాష్ట్ర నాయకుడు జెకె.రూఫస్, ఎంబీ సంఘం అధ్యక్షుడు ఆశీర్వాదం, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన చర్చిని సంఘం నాయకులతో కలిసి కసిరెడ్డి ప్రారంభించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాపాలన సాగిస్తుందన్నారు. ఆకుతోటపల్లి చర్చి అభివృద్ధికి ప్రభుత్వపరంగా తన వంతు సాయమందిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, ఎంపీపీ అనితవిజయ్, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ నారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీపాతి రజిత, ప్రమోద్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, నాయకులు రాంచంద్రయ్య, శ్రీను, ఎస్తేరు, టైటాస్, క్రిష్టఫర్, బిన్ని, రాజరత్నం, బుచ్చయ్య, బాల్‌రాజ్, విజయ్‌చందర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండకముందే జననాలు

- వాతావరణ మార్పుల దుష్ప్రభావం
- బాల్యం నుంచే జబ్బుల బారిన భావితరం
- పెరిగిపోతున్న శ్వాసకోశ సమస్యలు
- మందగిస్తున్న ఎదుగుదల.. తాజా అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏటేటా భూతాపం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో ప్రతికూల మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం పుట్టబోయే పిల్లలపై కూడా ఉంటుందని ఒక అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల మున్ముందు ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జననాలు నెలలు నిండక ముందే సంభవించే ప్రమాదం ఉందని ఆ స్టడీ హెచ్చరించింది. పుట్టిన పిల్లల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకుల బృందం ఈ అధ్యయనం జరిపింది. దీంట్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరిగిన 163 పరిశోధనలను విశ్లేషించారు. తద్వారా, చిన్నారుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏవిధంగా ఉంటుందనే దానిపై అందుబాటులో ఉన్న శాస్త్రీయ సమాచారాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. ప్రత్యేకించి ఎటువంటి తీవ్ర వాతావరణ మార్పుల వల్ల భావితరాల ఆరోగ్యంపై ఏ రకమైన ప్రభావం ఉంటుందన్నది పరిశీలించారు. పరిశోధనకు నేతృత్వం వహించిన కోరే బ్రాడ్‌షా తాము గుర్తించిన అంశాలను వెల్లడిస్తూ.. 'పిల్లల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావం గణనీయంగా ఉంటోందని గుర్తించాం. తీవ్రమైన చలివాతావరణం వల్ల చిన్నారుల్లో శ్వాససంబంధిత సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. కరువు, అధిక వర్షాలు వంటివి చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆస్ట్రేలియాలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంఖ్య పెరిగినట్లు గుర్తించాం. పశ్చిమ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్‌లలో పిల్లల్లో శ్వాససంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాఫ్రికాలో చిన్నారుల మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది' అని తెలిపారు. పిల్లలపై వాతావరణ మార్పుల ప్రభావం పేద, సంపన్న దేశాలనే తేడాలనే లేకుండా అన్ని చోట్లా కనిపిస్తోందన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరిన్ని దుష్ప్రభావాలు ఉంటాయని, అదొక సామాజిక, ఆర్థిక సమస్యలగా మారుతుందని హెచ్చరించారు. భవిష్యత్ తరాలు బాల్యంలోనే జబ్బుల బారినపడటంతో ఆయా దేశాలపై ఆర్థికభారం పెరుగుతుందని, కుటుంబాలపై, ఆరోగ్య సేవలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రజారోగ్య అభివృద్ధి విధానాలపై దృష్టిసారించాలని, మానవ చర్యలతో సంభవిస్తున్న వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయాలని ఈ అధ్యయనం ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ స్టడీ వివరాలను 'సైన్స్' జర్నల్ ప్రచురించింది.

ఏపీలో జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

- ప్రజలు అభివృద్ధి కోరతారు..
- యువత ఉద్యోగాలు అడుగుతారు
- ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు
- భవంతిలో బటన్ నొక్కితే ఓట్లు రాలవు
- జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్



అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమచేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

కదిలిన యంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఈ భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వే ద్వారా నిర్మాణాలు, భూముల సరిహద్దులు, ఎవరెవరు ఇక్కడ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు? ఎంత భాగం ఇందులో భూదాన భూములున్నాయి? వంటి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సర్వే నంబర్లపై విచారణ జరుపుతున్నామని, అన్ని అంశాలతో కూడిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ భూముల్లో పాగా వేసిన మరికొంత మంది పెద్దల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ధరణి వచ్చిన తరువాత పెద్దలంతా అధికార అండతో ఈ భూములను సొంతం చేసుకున్నట్లు వెల్లడవుతోంది. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో.. భూదాన్ భూములను కొనుగోలు చేసిన వారంతా లోలోన ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూదాన భూముల వ్యవహారంలో సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులు సోమవారం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వట్టినాగులపల్లిలో భూమికి సంబంధించి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వివరణకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. తాను 2014లో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో 2021 వరకు ఎందుకు నమోదు కాలేదనే విషయానికి మాత్రం సమాధానం లేదు. రాజేశ్వర్‌రెడ్డితో పాటు అనేక మంది భూముల వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదు. ధరణి పోర్టల్ వచ్చిన తరువాతే వీరందరికీ పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. విచిత్రమేమిటంటే.. 2021 జూన్ 10వ తేదీన అప్పటి కలెక్టర్ ఈ 29.27 ఎకరాల భూదాన భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టగా, అదే ఏడాది ఆగస్టు 24వ తేదీన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సర్వే నంబరు 188/1/2 పేరుతో పట్టాదారు పాస్‌బుక్ జారీ అయింది. ఆయనతోపాటు మిగతా వారికి పాస్‌బుక్ జారీ చేయడం వెనుక పెద్ద తతంగమే నడిపారు. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా చూపించి ధరణి ద్వారా పాస్‌బుక్‌లు జారీ చేశారు. సాధారణంగా ఇలాంటి విషయాల్లో స్థానిక తహసీల్దార్, మండల సర్వే అధికారుల నివేదిక తీసుకుంటారు. కానీ, ఇక్కడ నేరుగా ఏడీ ల్యాండ్ రికార్డ్స్ ఇచ్చిన స్కెచ్, భూదాన బోర్డు ఇచ్చిన స్కెచ్ ఆధారంగా పాస్‌బుక్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే అప్పటి వరకు అసలు సబ్‌డివిజన్, ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగినట్లు ఆధారాలు కూడా లేకపోవడం వల్లే రెవెన్యూ అధికారులు పాస్‌బుక్‌లు నిలిపివేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ 22ఏ జాబితాలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పైగా.. వీరు చూపిస్తున్న భూదాన బోర్డు స్కెచ్‌లో ఎక్కడా సంతకం గానీ, తేదీ గానీ, కనీసం స్టాంప్ గానీ లేకపోవడం గమనార్హం. ధరణి ముసుగులో జరిగిన ఈ బాగోతాలు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగానే బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నేను కొన్నది భూదాన భూమి కాదు: పల్లా

వట్టినాగులపల్లి భూదాన భూముల వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలు నిజం కాదని, వాటిని ఖండిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అక్కడ ఉన్నది కేవలం 1.10 ఎకరాలు మాత్రమేనని, ఇది కూడా భూదాన భూమి కాదని చెప్పారు. తాను వట్టినాగులపల్లి సర్వే నంబరు 181/1/2లో భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నానని, దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుని 2014లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో కూడా పొందుపరిచానని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డు స్కెచ్, భూదాన బోర్డు స్కెచ్ కూడా ఉన్నాయని చెప్పారు. వీటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చన్నారు.

మత్తుమందు ఇచ్చి యువతిపై ఇద్దరి అత్యాచారం

- నగ్నచిత్రాలు ఉన్నాయంటూ వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన

బోరబండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ వద్ద నగ్న చిత్రాలు ఉన్నాయంటూ.. చెప్పినట్లు వినకపోతే వాటిని బయటపెడతామంటూ ఆ ఇద్దరూ యువతిపై వేధింపులకు దిగారు. ఈక్రమంలోనే ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఏడాది క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికే బదిలీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఎల్బీనగర్ పరిధిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటూ డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రణవ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. దీంతో అతడు యువతి కళాశాల దగ్గర వెళ్లి కలిసేవాడు. గతేడాది యువతి కళాశాల వద్దకు వెళ్లిన ప్రణవ్ ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని బైక్‌పై తీసుకెళ్లాడు. అయితే ఆమెను ఇంటికి తీసుకెళ్లకుండా హోటల్‌కు తీసుకెళ్లి.. తాగునీటిలో మత్తుమందు కలిపిచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత మరో యువకుడితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే 2 నెలల క్రితం యువతి కుటుంబం బోరబండకు మకాం మార్చారు. ఈ నేపథ్యంలోనే యువతికి ఆ ఇద్దరు మళ్లీ ఫోన్ చేశారు. తాము చెప్పినట్లు వినాలని.. లేదంటే నగ్నచిత్రాలు బయటపెడతామంటూ వేధింపులకు దిగారు. దీంతో ఆ యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి.. వారితో కలసి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమన్వయం కుదిరేనా?

- కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నిర్వహణ కమిటీలు కనుమరుగైనట్టేనా?
- గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ
- బ్రహ్మోత్సవాలకు గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు
- అధికారులు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జాతర విజయవంతమయ్యేనా?

కీసర, మార్చి 3 : మేడ్చల్ జిల్లా కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధికారుల మధ్య సమన్వయం కుదిరి విజయవంతమవుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో ఒక్క సమీక్ష సమావేశం తప్ప.. తదుపరి కార్యాచరణపై అధికారులకు గానీ, ఆలయ నిర్వాహకులకు గానీ ఎలాంటి స్పష్టత లేదు. గతంలో బ్రహ్మోత్సవాలకు ముందే కలెక్టరేట్‌లో, కీసరగుట్ట కల్యాణ మండపంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ప్రణాళిక రూపొందించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పనులు చకచకా జరిగాయి. ప్రస్తుతం బడ్జెట్ విషయమై శాఖాపరమైన అధికారులకు పనులు అప్పజెప్పడం కానీ, ఆదేశాలు ఇవ్వడం కానీ జరగలేదని తెలుస్తోంది.

అధికారుల కో-ఆర్డినేషన్ కమిటీ కనుమరుగైనట్టేనా?

కొన్నేళ్లుగా ఏర్పాటుచేసిన అధికారుల కో-ఆర్డినేషన్ కమిటీ ప్రస్తుతం కనుమరుగైనట్లుగా తెలుస్తోంది.



కీసరగుట్టలోని రామలింగేశ్వరాలయం

గతంలో వివిధ శాఖలకు చెందిన అధికారులను సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ దాదాపు 16 కమిటీలు ఏర్పాటుచేసే వారు. కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు, ప్రొటోకాల్, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానోత్సవం, పార్కింగ్, వైద్యం, అగ్నిమాపక శాఖ ఇలా తమ బాధ్యతలు నెరవేర్చేవారు. రెండు రోజుల్లో జాతర ప్రారంభమవుతుండగా.. ఇప్పటి వరకూ కో-ఆర్డినేషన్ కమిటీ జాడ కనిపించడం లేదు.

ప్రత్యేక నిధులు మంజూరయ్యేనా?

గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేవారు. ప్రస్తుత జాతరకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం పట్ల పలువురు కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకురావడం లేదని సమాచారం. పార్కింగ్, రోడ్ల కొరకు భూమిని చదును చేసి, నీళ్లు చల్లేందుకు, మరుగుదొడ్లు కట్టేందుకు, మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్లు సుముఖంగా లేరనే వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో చేసిన పనులకే ఇప్పటి వరకు బిల్లులు రాలేదని, ఇప్పుడు ఎక్కడి నుంచి నిధులు తీసుకొచ్చి పనుల చేపట్టాలని కీసరలోని ఓ కాంట్రాక్టర్ తన గోడు వెళ్లబోసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులకు కూడా నిధుల పట్ల స్పష్టత లేకపోవడంతో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ, కమిషనర్‌కు నిధులు కేటాయించాలని కొందరు వినతిపత్రాలు అందజేసినట్లు సమాచారం.

స్థానిక ప్రజాప్రతినిధులకూ గుర్తింపు కరువు!

కీసరగుట్టపై జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. గత రెండు, మూడు సంవత్సరాలుగా స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరించి జిల్లా ఉన్నతాధికారులు ఒంటెద్దు పోకడ పోతుండటంతో జాతర ప్రాముఖ్యత సన్నగిల్లుతోంది. బ్రహ్మోత్సవాలు కేవలం అధికారులే కాదు ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, కాంట్రాక్టర్లతో సమన్వయం, దుకాణదారులు ఇవన్నీ కలిస్తేనే విజయవంతమయ్యే అవకాశం ఉంది. బ్రహ్మోత్సవాల విషయంలో స్థానిక రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో, పార్టీ ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ, వారిని దూరం పెడుతుండటం, సలహాలు, సూచనలు తీసుకోకుండా సమీక్షా సమావేశాలకు పిలవకపోవడం పట్ల కూడా జాతర విజయవంతమయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే.. ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన సభ్యుడు ఎమ్మెల్యేగా ఉన్నారు. దాంతో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడిందని చెప్పుకోవచ్చు. ఆరు రోజుల పాటు కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.




కీసరగుట్టపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అప్పటి కలెక్టర్ వెంకటేశ్వర్లు(ఫైల్)
జాతర ఏర్పాట్లపై కీసరగుట్టపై పర్యటిస్తున్న అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి (ఫైల్)

కోర్టు ఆదేశాలతోనే రాముడి గుడి కట్టగలిగాం

- దేశంలో ఇంకా 40వేల ఆలయాలను నిర్మిస్తాం
- యువత శివాజీ అడుగుజాడల్లో నడవాలి
- ఛత్రపతి విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే రాజాసింగ్

యాలాల/పూడూరు/దోమ, మార్చి 3 : ఎలాంటి అలజడులు లేకుండా కోర్టు ఆదేశాలతోనే అయోధ్యలో రాముడి గుడి కట్టగలిగామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని అగ్గనూరులో ఆదివారం ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజాసింగ్ మాట్లాడారు. దేశంలో ఇంకా 40వేల ఆలయాలు నిర్మిస్తామన్నారు. యువత దైవభక్తిని కలిగి ఉండి, ప్రతీవారం ఆలయాలకు వెళ్లి పూజలు చేయాలని సూచించారు. ప్రతీఒక్కరు శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గోవులను సంరక్షించి కాపాడాలన్నారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అగ్గనూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. వివేక్ యోజన సంఘం సభ్యులు, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ సర్పంచ్ భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పరిమళ తదితరులున్నారు. అంతకుముందు రాజాసింగ్ లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో గల వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అగ్గనూర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అదే విధంగా మధురలో శ్రీకృష్ణుని ఆలయాన్ని కట్టితీరుతామని రాజాసింగ్ అన్నారు. పూడూరు మండలం కంకాల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణానికి ముఖ్యఅతిథిగా వచ్చి విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం యువకులు ఆయనను భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. గ్రామాల్లో ఎక్కడైనా లవ్ జిహాద్‌కు పాల్పడకూడదన్నారు. కాశీ, అయోధ్య, మధుర మూడే ఆలయాలు కావాలని వేడుకుంటే ఇవ్వలేదు కానీ, ఇప్పుడు అఖండ భారతంలో హిందువులు ఏకమై తమ దేవాలయాలను కాశీలో కాశీవిశ్వనాథ్ దేవాలయం, అయోధ్యలో రామమందిరం, మధురలో శ్రీకృష్ణ దేవాలయం కట్టితీరుతామన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపిస్తే హిందూ గొంతును వినిపిస్తారన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, సుధాకర్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కిషన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ బోనేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నర్సింహారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్, రవీందర్, నాయకులు శ్రీనివాసరెడ్డి, పేరి రాంచందర్‌యాదవ్, యువకులు తదితరులున్నారు. యువకులు విగ్రహ దాత జడ్పీటీసీ మేఘమాల ప్రభాకర్‌గుప్తాలను సన్మానించారు. విగ్రహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించినవారిని సన్మానించారు. కాగా, రాజాసింగ్ ఆదివారం రాత్రి మోత్కూర్ గ్రామ ప్రధాన గేటు వద్ద ఏర్పాటుచేసిన శివాజీ, స్వామివివేకానంద, పండగల సాయన్న విగ్రహాల ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనెటి, విగ్రహాల దాత కరణం ప్రహ్లాద్‌రావు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, శివాజీ, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పూడూరు : శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజాసింగ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షార్ట్‌సర్క్యూట్.. ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం

- రూ.50లక్షల మేర నష్టం

తాండూరు, మార్చి 3 : షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఎలక్ట్రికల్ షాప్ దగ్ధమైంది. ఈమేరకు రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. మార్వాడీ బజార్‌లోని పర్ఫెక్ట్ ఎలక్ట్రికల్ షాపులో శనివారం రాత్రి మంటలు చెలరేగి దుకాణంలోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. తెల్లవారుజామున షాపు నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో వారు అక్కడికి చేరుకుని మంటలార్పారు. రూ.30లక్షలు విలువ గల ఎలక్ట్రికల్ సామగ్రి, రూ.20లక్షలు విలువ గల ఫర్నీచర్ దగ్ధమైనట్లు యజమాని పాషా తెలిపాడు. పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. షాపును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సాయమందేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు బంటారం భద్రేశ్వర్, ముజీబ్‌లు మాట్లాడుతూ బాధితుడికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఈటలను కలిసిన మేడ్చల్ జిల్లా నాయకులు

మేడ్చల్ టౌన్, మార్చి 3 : మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్‌కు టికెట్ ఖరారు కావడంతో ఆయన విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేస్తారని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మునీరాబాద్ శివార్లలోని ఈటల రాజేందర్ నివాసానికి జిల్లా బీజేపీ నాయకులు వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో బీజేపీ చరిత్ర సృష్టించనుందన్నారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలే పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఈటల రాజేందర్ లాంటి సమర్థుడైన నాయకునికి టికెట్ ఇచ్చి ఎన్నికల రంగంలో దింపటంపట్ల పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం చోటు చేసుకుందన్నారు. ఈసారి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం పార్టీ ఖాతాలో చేరటం ఖాయమని తెలిపారు. ఈటల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు జోరుగా ఇంటింటి ప్రచారం చేపడుతారని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణగౌడ్, రవీందర్‌గౌడ్, తదితరులు ఈటలను కలిసిన వారిలో ఉన్నారు.



ఈటల రాజేందర్‌తో మేడ్చల్ జిల్లా బీజేపీ నాయకులు

మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం, మార్చి 3 : ముస్లిం మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగారంలోని మదర్సాలో జరిగిన నూర్ ఉల్ ఉలోం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మదర్సా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మదర్సా ఇన్‌చార్జి మహ్మద్ గౌస్, ఉస్మాన్‌ఖాన్, బిస్మిల్లా, హాజీ ఖాన్, ఆ జం, మర్యాద రాఘవేందర్‌రెడ్డి, లింగం, పాండుయాదవ్, నయాం తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం


పరిగిలో పోలియో చుక్కలను వేస్తున్న 13వవార్డు కౌన్సిలర్ కృష్ణ, డాక్టర్ ప్రవీణ్


తాండూరులో చిన్నారులకు పోలియో చుక్కలువేస్తున్న కౌన్సిలర్ మంకాల రాఘవేందర్

ధారూరు, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ అన్నారు. ధారూరు, నాగసమందర్‌లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలియో కేంద్రాల్లో నిల్వ ఉంచిన పోలియో వ్యాక్సిన్ వాయిల్స్‌ను ఆయన పరిశీలించారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులకు వేసిన పల్స్‌పోలియో రిజిష్టర్‌ను ఆయన పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రేష్మ, శివకుమార్, హెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఈ సురేందర్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని బస్టాండ్, ప్రధాన రహదారుల్లో, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వైద్యురాలు సుజల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

తాండూరు: 26వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ మంకల రాఘవేందర్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: జీరో టు ఐదు సంవత్సరాలలోపు ఉన్న చిన్నారి బాలబాలికలకు తప్పనిసరి పోలియో చుక్కలు వేయించాలని యాలాల ఆరోగ్య కేంద్రం అధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది సహకారంతో చిన్నారి బాలబాలికలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

కొడంగల్: కొడంగల్ పట్టణంతో పాటు బస్టాండ్, వినాయక చౌరస్తా తదితర ప్రాంతాల్లో వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా కొడంగల్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్.సోమశేఖర్ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు అంజమ్మ, సత్యమ్మ, ఆశా కార్యకర్త ఇందిరా పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలో 0 నుండి 5సంవత్సరాల లోపు మొత్తం 4260 మంది పిల్లలు ఉన్నారు. వారందరికి పల్స్‌పోలియో చుక్కలు వేయడానికి మండలాన్ని మూడు రూట్లుగా ఏర్పాటు చేశారు. 26 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సమీన, ఏఎన్‌ఎం కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని 13వవార్డులో కౌన్సిలర్ ఎ.అనసూయ చిన్నారులకు పోలియో మందును వేసి ప్రారంభించారు. బెస్తవాడలో చిట్యాల్ ఆరోగ్యకేంద్రం డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో 39, పరిగిలో ఎనిమిది కేంద్రాల్లో చుక్కలు వేశారు. మండలంలో 6434 పిల్లలకు చుక్కల మందును వేసినట్లు తెలిపారు.

దోమ: స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రంలో దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కె.రాజీరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సత్యమ్మ, అంగన్‌వాడీ టీచర్ భీమమ్మ, బుక్ కీపర్ భాగ్య, మైనారిటీ నాయకులు మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఆమె చుక్కలు వేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కులకచర్ల ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ వాజీద్‌హుసేన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు. మండలంలో 5301 మంది చిన్నారులు ఉండగా వారి కోసం రెండు మండలాల పరిధిలో 55 పోలియో కేంద్రాల ద్వారా 220 మంది సిబ్బందిని 5 మంది రూట్ సూపర్‌వైజర్స్‌ను నియమించారు. పాటు ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేసి 15 ప్రాంతాల్లోని హైరిస్క్ ఏరియాల్లో ఇటుక బట్టీలు, తండాల్లోని పిల్లలకు మొబైల్ టీం ద్వారా పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారం రెండు రోజులు సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. రెండు మండలాల్లో 5 సంవత్సరాల్లోపు చిన్నారులు 5301 మంది ఉండగా 5481 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.


కొడంగల్: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: పల్స్ పోలియో కార్యక్రమం దౌల్తాబాద్ మండలంలో ఆదివారం విజయవంతంగా ముగిసింది. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా మండలంలో 5493 మంది చిన్నారులు ఉండగా 5264 మంది చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.

పూడూరు: మండలంలో పల్స్ పోలియోగా మంచి స్పందన లభించింది. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఆదివారం 0-5ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందులు వేశారు. గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల ఆవరణల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కల మందును వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: మండలంలోని డబీల్‌పూర్‌లో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్‌లో మర్రి దీపిక నర్సింహారెడ్డిలు పోలియో చుక్కల కేంద్రాలను ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో కేంద్రాలు నిర్వహించారు. ఎండీఓ, వైద్య శాఖ అధికారులు, కమిషనర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

ఘట్‌కేసర్: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో పల్స్‌పోలియోను ప్రారంభించారు. నారపల్లి పీహెచ్‌సీ పరిధిలో 40సెంటర్ల ద్వారా 16,515మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు మంచి స్పందన వచ్చిందని నారపల్లి పీహెచ్‌సీ అధికారులు తెలిపారు. ప్రధానంగా బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలో ఉండే చిన్నారులు అధికసంఖ్యలో ఇక్కడికి రావడంతో ఎక్కువ మందికి వేశామని తెలిపారు. మండలంలోనూ మిగిలి పోయిన చిన్నారులందరికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి పోలీయో చుక్కలు వేస్తామన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పోలియో రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అవుషాపూర్‌లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమాజం నుంచి పోలియోను తరమికొట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పోలియో చుక్కలు వేస్తున్న చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి

శామీర్‌పేట: చుక్కల మందుకు అపూర్వ స్పందన లభించిందని ఎంపీటీసీ సాయిబాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం శామీర్‌పేటలో ఎంపీటీసీ సాయిబాబు పిల్లలకు చుక్కల మందును వేశారు. శామీర్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పల్స్‌పోలియో కేంద్రాల్లో 5 ఏళ్ళ లోపు పిల్లలకు పల్స్‌పోలియో మందు చుక్కలను వేశారు. అదేవిధంగా తుర్కపల్లిలోని హెల్త్ సబ్‌సెంటర్‌లో డాక్టర్ సృజన, సిబ్బంది చిన్నారులకు పోలియో నివారణ చుక్కలను వేశారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్‌లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాల్లో కమిషనర్ వెంకటగోపాల్, ఆరోగ్యశాఖ సిబ్బంది ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలను వేశారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని దేవరయాంజాల్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు చిన్నారులకు పోలియో నివారణ చుక్కలను వేశారు.


కీసర రూరల్: నాగారంలో పోలియో చుక్కలు వేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్: రెండు చుక్కల మందుతో చిన్నారుల భవిష్యత్తు భద్రమని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లు కౌకుంట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత అన్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరిగౌడ్, వికాస్‌నగర్ బస్తీ దవాకాన వైద్యుడు కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అసైన్డ్ భూ బాధితులతో మానవహక్కుల వేదిక బృందం సమావేశం


అభిప్రాయాలు సేకరిస్తున్న మానవ హక్కుల వేదిక బృందం ప్రతినిధులు

కొడంగల్ రూరల్, మార్చి 3: మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో చేపట్టనున్న మెడికల్ కళాశాల నిర్మాణానికి చేపట్టిన భూసేకరణ విషయంలో వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు అప్పాయిపల్లిలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. సర్వే నెం.19లోని 75 ఎకరాల భూమిని 1972లో 47 కుటుంబాలకు జీవనాధారంగా అసైన్డ్ పట్టాలు అందించడం జరిగిందని రైతులు తెలిపారు. ఆరోజు సాగుకు అనుకూలంగా లేకుండా బండలు, రాళ్లు, రప్పలతో కూడిన భూములను కొన్నేళ్ల పాటు కష్టపడి సాగు యోగ్యంగా చేసుకొని మూడు తరాలుగా జీవనాధారం పొందుతున్నట్లు తెలిపారు. ఆ భూముల్లో బోర్లు, బావులు లాంటి వ్యక్తిగత సాగునీటి సౌకర్యాలు కల్పించుకొని ఆ భూమే ఏకైక జీవనాధారంగా దాదాపు 150 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్లు రైతులు తెలిపారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, పేద, బలహీన వర్గాల భూములను తీసుకోకుండా భూస్వాముల దగ్గర తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, వెంటనే భూములను తీసుకోమని అధికారులు ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కర్త వసంతలక్ష్మీ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ ఆదంరాజు, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, వెంకటనారాయణ, రోహిత్, మధు, వివిధ ప్రజా సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు నాగిరెడ్డి, ఏర్పుల చంద్రప్ప, ఎం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య, శ్రీనివాస్, సూర్యనాయక్, యు.రమేశ్‌బాబు, దస్తప్ప, బలరాం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇంటింటికి గోనె సంచుల పంపిణీ


గోనె సంచులను పంపిణీ చేస్తున్న మీరాకుమారి

కులకచర్ల, మార్చి 3: కులకచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలోని అంగడి బజార్‌లో మహిళలకు బ్యాగులను చేవేళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి మీరాకుమారి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిర్మూలించాలనే లక్ష్యంతో గోనే సంచులను ప్రతీ ఇంటికి అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె మహిపాల్, శ్రీనివాస్, సిహెచ్ హనుమంతు, నర్సింహారెడ్డి, శ్రీశైలం, ఆంజనేయులు, కేవీఆర్ ఫౌండేషన్ పరిగి నియోజకవర్గ ఇంచార్జ్ రామచంద్రయ్య, భైరం నరేశ్, మాల అనంతయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం


జీరో బిల్లును అందజేస్తున్న ఎంపీటీసీ గోనె హనుమంతరెడ్డి

శామీర్‌పేట, మార్చి 3: పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని కేశరం ఎంపీటీసీ గోనె హనుమంతరెడ్డి అన్నారు. గతనెల 27వ తేదీన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం మూడుచింతలపల్లి మండలం కేశవరంలో ఎంపీటీసీ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో గృహజ్యోతి ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు జీరో బిల్లులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంటం కృష్ణారెడ్డి, బొమ్మలపల్లి మల్లేశ్, సంజీవరెడ్డి, రాజు, వీరప్ప, లైన్‌మెన్ ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగాల పడిపూజ


ద్వాదశ జ్యోతిర్లింగాల పడి పూజలో పాల్గొన్న శివస్వాములు

కులకచర్ల, మార్చి 3: చెరువు ముందరి తండాలో శివానంద గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. పూజ కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, సుబ్రహ్మణ్య పూజ, నవగ్రహాలకు పూజ, శివుడికి మహా రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శివానంద, శంకర్, వినోద్, సత్యం, నర్సింహారెడ్డి, చెరువు ముందరి తండా శివస్వాములు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువల బోధన


పరిగిలోని శ్రీసరస్వతీశిశుమందిర్ వార్షికోత్సంలో పాల్గొన్న వెంకట్‌రెడ్డి

పరిగి, మార్చి 3: శిశుమందిర్ విద్యాలయాల్లో విద్యతోపాటు నైతిక విలువలను బోధిస్తారని అఖిల భారత సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పరిగిలోని శ్రీసరస్వతీశిశుమందిర్ 50వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కసిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. శిశుమందిరాల్లో దేశ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడే విధంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, ఎంఈవో హరిశ్చందర్, విశిష్ట అతిథి శ్రీకాంత్‌రావు, ప్రధానాచార్యులు కె.మల్లేశ్ పాల్గొన్నారు

గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

వికారాబాద్, మార్చి 3: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ 2024 విద్యా సంవత్సరంలో 6, 7, 8వ తరగతుల్లో బ్యాక్ లాగ్ ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 14కేంద్రాల్లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. వికారాబాద్‌లో ఎనిమిది, పరిగిలో ఆరు కేంద్రాల్లో నిర్వహించారు. 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి 3398మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 3066 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలకు 332మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలను జిల్లా సమన్వయ అధికారి సందర్శించి పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

స్పీకర్‌ను సన్మానించిన గోల్డ్ జువెల్లరీ అసోసియేషన్ సభ్యులు


ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వికారాబాద్, మార్చి 3: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను వికారాబాద్ పట్టణ విశ్వకర్మ సంఘం సభ్యులు, వికారాబాద్ గోల్డ్ జువెల్లరీ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ప్రముఖ వ్యాపార వేత తస్వర్ అలీ తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

ఘట్‌కేసర్ రూరల్ మార్చి 3: జిల్లా పరిషత్ ఎదులాబాద్ పాఠశాలలో చదువువున్న 2004-2005 బ్యాచ్ విద్యార్థులు తమతో పాటు చదువుకున్న విద్యార్థిని కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. 2004-2005 బ్యాచ్ విద్యార్థిని స్వప్న అమె భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో అమె కుటుంబానికి నాటి మిత్రులు రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో స్వప్న, ఆమె భర్త మృతిచెందడంతో వారి పిల్లలు అనాథలుగా మిగలడం బాధాకరమని వారి మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వప్న కుటుంబానికి తాము అండగా ఉంటామని, 2004-2005 బ్యాచ్ విద్యార్థులు భరోసా కల్పించారు. తమతో పాటు చదువుకున్న వారికైనా ఇబ్బందులు కలిగిన ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2004-2005 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శం


సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 3: నిరుపేద కుటుంబంలో పుట్టి గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్న జీవితం నేటి తరానికి ఆదర్శమని ఘట్‌కేసర్ మజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అవుటర్ రింగ్‌రోడ్డు చౌరస్తా వద్ద గల సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్‌కు ఆదివారం నివాళులర్పించారు. ఈసందర్భంగా ఘనాపూర్ మాజీ సర్పంచ్ వేముల సంజీవగౌడ్ కుటుంబసభ్యులు వేముల బలగం తరలివచ్చి పాపాన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత పాపన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారి దాసు, కౌన్సిలర్లు బండారి అంజనేయులు, రమాదేవి, నాయకులు బాల్‌రాజ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇళ్ల అనుమతులకు మామూళ్ల వసూలు



పూడూరు, మార్చి 3: మండలంలోని చీలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి అవినీతి బాగోతం బయటపడింది. ఇళ్లనిర్మాణ అనుమతులకు భారీగా ముడుపులు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఏడాదిన్నర కిందట చీలాపూర్ గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శిసాకలి మొగులయ్య గ్రామాల్లో నూతన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనలకు మూడింతలు అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇళ్ల నిర్మాణ అనుమతులకు రూ.7వేల నుంచి రూ.10వేల మధ్య పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుంది. అయితే చీలాపూర్ పంచాయతీ కార్యదర్శి మాత్రం అంతకు మూడింతలు వసూలు చేస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. నగదు రూపంలోనే డబ్బులను తీసుకుంటూ బయటపడేవాడని, అయితే కొందరు ఆయనకు ఫోన్‌పే రూపంలో డబ్బులు వేయడంతో సార్ బాగోతం బయటపడింది. గ్రామపంచాయతీ నుంచి ఇచ్చిన ఇళ్ల లెక్క ప్రకారం రూ.18వేలు అయితే తాను తీసుకున్న లెక్క ప్రకారం దాదాపు రూ.40వేల వరకు వసూలు చేశారు. మొగులయ్య పంచాయతీ కార్యదర్శిగా వచ్చినప్పటి నుంచి చాలా మంది దగ్గర వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అభివృద్ధి పనుల పేరిట వచ్చే బిల్లుల చెల్లింపుల విషయంలోనూ చేయి చాచినట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. చీలాపూర్ గ్రామానికి చెందిన ఉమ్మెంతల్ దయాకర్ వద్ద ఇంటి అనుమతి కోసం వెళ్తే రూ.40వేలు అవుతుందని చెప్పారని బతిమాలితే రూ.28వేలకు తగ్గారని తెలిపాడు. అదేగ్రామానికి చెందిన వడ్డె రామస్వామి గతంలో అండర్ డ్రైనేజీ పనులు చేయించగా బిల్లుల విషయంలో సతాయించాడని వాపోయాడు. వచ్చిన బిల్లులో తనకు కొంత ముట్టజెప్పాలని కార్యదర్శి మొగులయ్య డిమాండ్ చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. చీలాపూర్ గ్రామస్తుడు గోవర్దన్‌రెడ్డి ఇంటి అనుమతి కోరగా మొగులయ్య రూ.35వేలు డిమాండ్ చేసినట్లు తెలిపాడు.తనవద్దే కాకుండా చాలామంది వద్ద డబ్బులు వసూలు చేసినట్లు చెప్పాడు. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్న కార్యదర్శి మొగులయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మొగులయ్యను సంప్రదించగా ఇంటి పర్మిషన్ కోసం కొందరు బలవంతంగా తనకు డబ్బులు ఇచ్చారని తెలిపారు. అంతేకానీ తాను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదని తెలిపారు. కావాలనే కొందరు తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

మీ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి

బషీరాబాద్, మార్చి 3: మండలంలోని మైల్వార్ మీసేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మైల్వార్ గ్రామ యువకులు పలువురు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆదివారం ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో మీసేవా కేంద్రంతో పాటు శాశ్వత ఆధారం సెంటర్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్థానికంగా మీసేవా కేంద్రం, ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, టీజీబీ బ్యాంక్ సీఎస్పీ శ్రీకాంత్, యూత్ నరల్ సెక్రెటరీ శ్రీహరి, నాయకులు దానం సాయిలు, నాగేష్, మున్నూర్ వినోద్, విజయ్, యశ్వంత్, విజయ్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌గౌడ్ ఇంటికి ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విశ్వనాథ్ గౌడ్

తాండూరు: తాండూరులో కల్లుగీత పారిశ్రామిక సొసైటీ కార్యవర్గం మార్పు అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్ ఇంటికి వెళ్లడం చర్చనీయంశమైంది. ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేను విశ్వనాథ్ గౌడ్ సన్మానించారు.

తాండూరు: తాండూరులోని శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి గౌడ్, కౌన్సిలర్ నీరజబాల్‌రెడ్డి, పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆలయంలో భద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూరు రూరల్: పీఆర్టీయూ 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్, శ్రవణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మల్లేశం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


మట్లాడుతున్న యూత్ లీడర్ నగేష్‌యాదవ్, తదితరులు

బషీరాబాద్, మార్చి 3: మండలంలోని జలాల్‌పూర్ పంచాయతీలో రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఉపాధిహామీ నిధులు మంజూరు చేయడంతో పనులు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ నగేష్‌యాదవ్, సతీష్, శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఆదివారం ఎస్సీ కాలనీ నుంచి సీసీ రోడ్డును కిందిగేరి హనుమాన్ ఆలయం వరకు ప్రారంభించారు. ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డి మెట్లకుంటలో పర్యటించి నిర్ణీత గడువు లోపు సీసీరోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు పనులను వేగవంతం చేశారు.

ఘట్‌కేసర్ సీఐగా సైదులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 3 : ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ సీఐగా ఎస్. సైదులు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన గోవర్దనగిరి నగరంలోని మాసబ్‌ట్యాంక్ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్ళారు. సైదులు హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం నుంచి బదిలీపై ఘట్‌కేసర్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనాథ్

శామీర్‌పేట: శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్లఆ సనా శ్రీనాథ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన నిరంజన్‌రెడ్డి నార్సింగ్ ట్రాఫిక్ సెక్టార్‌కు బదిలీఅయ్యారు. నిరంజన్‌రెడ్డి శామీర్‌పేటలో దాదాపు ఏడు నెలలు మాత్రమే పనిచేసి బదిలీ అయ్యారు. కాగా శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనాథ్ పనిచేస్తూ బదిలీపై శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు.

పేదవారికి అండగా నిలవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 3: సమాజంలో బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉండాలని ఎదులాబాద్ బీఆర్‌ఎస్ నాయకుడు కానుగంటి శ్రీనివాస్ తెలిపారు. మండల రిధి ఎదులాబాద్ అనుబంధ గ్రామం పోతరాజిగూడలో ఆదివారం మృతిచెందిన సామలేటి పెద్ద నర్సమ్మ కుటుంబ సభ్యులకు కానుగంటి శ్రీనివాష్, అంత్యక్రియల నిమిత్తం పదివేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అల్లం శంకర్, పెద్ద నర్సమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చేతి పంపుల మరమ్మతులు

కొడంగల్ రూరల్, మార్చి 3: కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్ చేతి పంపును మెకానిక్‌తో మరమ్మతు చేయించారు. దీంతో కాలనీల్లో తాగునీటి సమస్య తీరింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పూడూరు, మార్చి 3: మండలంలోని జాతీయ రహదారిపై రాకంచర్ల గ్రామం సమీపంలో ఓపత్రికా విలేకరి(ఆంధ్రజ్యోతి కాదు) మధుసూదన్ రెడ్డి పరిగికి తన బైక్‌పై వెళ్తుండగా నడుస్తూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి కాలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. అదేవిధంగా మధుసూదన్‌కూ గాయాలయ్యాయి. వీరిని స్థానికులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.